సాక్షి
వికారాబాద్
మంగళవారం। 21 ఫిబ్రవరి। 2023



సాగు భారం..!
అన్నదాతలకు సాగు భారమవుతోంది. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతున్నారు. 8లో▸



కుస్తీ పడుతున్న పహిల్వాన్లు, పోటీలను తిలకించేందుకు తరలివచ్చిన జనం

న్యూస్‌రీల్

రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

తాండూరు రూరల్: మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు బుధవారం చివరి గడువు అని జినుగుర్తి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతితో పాటు 7నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

మొక్కలు ఎండితే కార్యదర్శులపై చర్యలు



మొరంగపల్లి పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అనిత

మోమిన్‌పేట: నాటిన ప్రతీ మొక్కకు నీరందించాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. ఎంపీడీఓ శైలజారెడ్డితో కలిసి మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామాన్ని సోమవారం ఆమె సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు ఎండిపోతే సదరు కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయని సంతోషం వ్యక్తంచేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. ఈ ఎరువులను మొక్కలకు వేయాలని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పంచాయతీ సెక్రటరీలు విధిగా యాప్‌లో అటెండెన్స్ వేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి మాధవి తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా ఎరువులు అమ్మొద్దు



పంటలను పరిశీలిస్తున్న ఏఓ పద్మావతి

బొంరాస్‌పేట: అనుమతి లేకుండా ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పద్మావతి హెచ్చరించారు. నాగిరెడ్డిపల్లిలోని పలు షాపుల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. శ్రీపరమేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణంలో స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈపాస్ ద్వారానే విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వరి పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు.

ఏఐసీసీలో రమేశ్ మహరాజ్‌కు చోటు



రమేశ్‌మహరాజ్

తాండూరు: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) మెంబర్‌గా రమేశ్ మహరాజ్‌కు స్థానం దక్కింది. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

భార్యను చంపిన భర్త

మొయినాబాద్: మద్యానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా కొట్టి చంపాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాచారం గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్, అతని భార్య హుస్సేన్ బీ(50) కొంత కాలం క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. విజయనగర్ కాలనీలో ఓ గుడిసె వేసుకుని ఉంటూ భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హుస్సేన్ మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో అప్పటికే మత్తులో ఉన్న హుస్సేన్ కర్రతో భార్య కాళ్లపై కొట్టాడు. ఆమె కింద పడిపోవడంతో రుబ్బురోలు రాయితో ఛాతి, ముఖంపై బలంగా మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



జీవన్గీలోని కాగ్నా ఇసుక మేటలపై తలపడుతున్న మల్లయోధులు

కన్నడ వీరుడికే కడియం

- జీవన్గీలో హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు
- 200 మందికిపైగా పాల్గొన్న పహిల్వాన్లు
- విజేతగా నిలిచిన సిద్ధప్ప


బషీరాబాద్: జీవన్గీలోని మహాదేవలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన పహిల్వాన్లు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పద్దెనిమిదేళ్ల బాలుడి నుంచి ముప్పై ఏళ్లలోపున్న 200 మందికిపైగా పాల్గొన్నారు. అబ్బురపరిచే పట్లతో ఔరా అనిపించారు. కాగ్నా ఇసుక దిబ్బలపై జరిగిన పోటీల్లో కన్నడ వీరుడు సిద్ధప్ప విజేతగా నిలిచాడు. గుల్బర్గా జిల్లా అలంద తాలుకాలోని బెలంగి గ్రామానికి చెందిన సిద్ధప్పకు.. డీఎస్పీ శేఖర్‌గౌడ్ చేతుల మీదుగా 5తులాల వెండి కడియం, నగదు పురస్కారం అందజేశారు. అంతకు ముందు స్వామివారి కలశాన్ని వేలం వేయగా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీరారెడ్డి రూ.51,000 సొంతం చేసుకున్నాడు. తాండూరు రూరల్ సీఐ రాంబాబు, బషీరాబాద్ ఎస్‌ఐలు విద్యాచరణ్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, ఆలయ కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వందలాదిగా తరలివచ్చారు.



సిద్ధప్పను విజేతగా ప్రకటిస్తున్న డీఎస్పీ శేఖర్

పరిహారం.. స్వాహా పర్వం!

- ఫార్మాసిటీ భూ సేకరణలో భారీగా అవకతవకలు
- తాడిపర్తిలో 250 ఎకరాల భూదాన్ భూములు మాయం
- కుర్మిద్దలో నకిలీ అసైన్డ్‌దారులకు నష్టపరిహారం చెల్లింపు
- బహిరంగ విచారణకు తాడిపర్తి, కుర్మిద్ద రైతుల డిమాండ్
- అంతా పారదర్శకమే అంటున్న రెవెన్యూ అధికారులు



భూదాన్ భూమి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔషధనగరి భూసేకరణలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఖరారులో భారీగా చేతులు మారాయి. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల చేతివాటంతో అర్హులకు అందాల్సిన పరిహారం కాస్తా అక్రమార్కుల జేబుల్లోకి చేరింది. అసైన్డ్ భూముల సేకరణ, పరిహారం చెల్లింపులో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫార్మాసిటీ కోసం టీఎస్‌ఐఐసీ సేకరించిన అసైన్డ్ భూముల పరిహారం ఖరారు, లబ్ధిదారుల ఎంపికలో శాస్త్రీయత పాటించకపోవడంతో అక్రమాలకు తావిచ్చినట్లు తెలుస్తోంది. యాచారం మండలం తాడిపర్తి, కుర్మిద్ద రెవెన్యూ పరిధిలోని భూముల సేకరణ, నష్ట పరిహారం చెల్లింపుపై 'సాక్షి ప్రతినిధి బృందం' క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి.

బినామీల ఖాతాల్లో నష్టపరిహారం

ఫార్మాసిటీ కోసం కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల నుంచి 19,333 ఎకరాలను సేకరించాలని నిర్ణయించి.. తొలిదశలో పది వేల ఎకరాలు సమీకరించారు. వీటిలో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, పట్టా భూములు ఉన్నాయి. అసైన్డ్‌దారులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ.8 లక్షలు చెల్లించగా, పట్టాదారులకు రూ.16 లక్షలు ప్రభుత్వం చెల్లించింది. అసైన్డ్, భూదాన్, ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లింపులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అప్పటి వరకు రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా ఉన్నవి కాస్తా ఆ తర్వాత పట్టా భూములుగా మారాయి. ఈ భూముల్లో పొజిషన్‌లో ఉన్నవారికి తెలియకుండానే అదనంగా మరికొందరి పేర్లు కబ్జాకాలమ్‌లో చేరాయి. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులను పక్కన పెట్టి బినామీల పేర్లతో పరిహారం కాజేసినట్లు సమాచారం.

తాడిపర్తిలో 250 ఎకరాల భూదాన్ భూమి మాయం

యాచారం మండలం తాడిపర్తి రెవెన్యూ పరిధిలో 648.34 ఎకరాల భూమిని సేకరించారు. సర్వే నంబర్ 104లో 250 ఎకరాల భూదాన్ భూమి కూడా ఉంది. ఈ భూమిని బొక్క సీతారెడ్డి, బొక్క కృష్ణారెడ్డి, బొక్క రాంరెడ్డి, బొక్క సుదర్శన్‌రెడ్డి కుటుంబం 1954లోనే భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేసింది. రెవెన్యూ రికార్డుల్లో కారీజు ఖాతాగా నమోదు చేసి, దీనిలో కొంత భూమిని నిరుపేదలకు దానం చేశారు. నిజానికి ఎవరైనా ఒకసారి భూదాన్‌బోర్డుకు భూమిని వితరణ చేసిన తర్వాత తిరిగి తీసుకునే హక్కు లేదు. ఫార్మాసిటీ భూ సేకరణ ప్రకటన తర్వాత ఈ భూదాన్ భూమికి నకిలీ వారసులు పుట్టుకొచ్చారు. ఈ భూములకు తామే హక్కుదారులమని పేర్కొంటూ బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేశారు.అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా వారికి అండగా నిలిచింది. అంతా కలిసి భూదాన్ భూములను మాయంచేశారు.భూ సేకరణలో భాగంగా ప్రభుత్వంచెల్లించిన నష్టపరిహారాన్ని సొంత ఖాతాల్లో జమ చేసుకున్నారు.

కుర్మిద్దలో నకిలీలకు నష్టపరిహారం

కుర్మిద్దలోని సర్వే నంబర్ 39లో 112 ఎకరాల సీలింగ్ భూమిని 86 మందికి అసైన్డ్ చేశారు. ఫార్మాసిటీ కోసం ఈ భూములు సేకరించారు. కబ్జాలో ఉన్న బాధితులకు బదులు భూమితో సంబంధం లేని వారికి అధికారులు పరిహారం కట్టబెట్టారు. కబ్జాలో ఉన్న బాధితులకు విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. న్యాయం చేయాలంటూ గోపల్లి అంజయ్య, గోపల్లి సాలయ్య, తెల్గమల్ల సంజీవ నాలుగేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అవార్డు పాసైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ వారి ఖాతాల్లో పరిహారం జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు.

అక్రమాలకు తావులేదు

ఫార్మాసిటీ భూ సేకరణ అంతా పారదర్శకంగా జరిగింది. కొంత మంది కావాలనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. నాకంటే ముందే ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన అధికారి భూదాన్ భూములపై ఆరా తీశారు. అన్నీ నిర్ధారించుకున్న తర్వాతే పట్టాదారుల పేర్లు నమోదు చేశారు. అక్రమాలకు తావులేదు. ఎలాంటి విచారణకైనా సిద్ధం.

– వెంకటాచారి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

సమస్య పరిష్కారం కాలేదు



సర్వే నంబర్ 39లో 1.12 ఎకరాల భూమి ఉంది. 2017లోనే ఫార్మాసిటీ కోసం తీసుకున్నారు. 40 ఏళ్లుగా కబ్జాలో ఉన్నాను. నాకు రావాల్సిన నష్టపరిహారం నకిలీ పాసుపుస్తకాలు ఉన్న వాళ్ల ఖాతాలో జమైంది. న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం సమస్య పరిష్కారం కాలేదు.

– గోపల్లి అంజయ్య, కుర్మిద్ద

పరిహారం రాకుండా చేశారు



భూదానోద్యమంలో పాల్గొన్నాను. సర్వే నంబర్ 104 ఎండ్లకంచె (భూదాన్ భూమి)లో మూడెకరాలు ఇచ్చారు.రాళ్లు, రప్పలతో ఉన్న భూమిని చదును చేసుకున్నాం.అప్పట్లో జొన్నలు, నువ్వులు, ఆముదాలు పండించాం. మా కబ్జాలో ఉన్న భూములను బలవంతంగా లాగేసుకున్నారు. రావాల్సిన పరిహారాన్ని రాకుండా అడ్డుకున్నారు.

– బద్దుల సత్తెమ్మ, తాడిపర్తి

సమగ్ర విచారణ జరిపించాలి



ఎకరానికి రూ.16 లక్షలతో పాటు 120 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వానికి రూ.70 కోట్లు పరిహా రం రూపంలో కోల్పోవాల్సి వచ్చింది. తాడిపర్తి భూదాన్ భూములపై బహిరంగ విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన ఆర్డీఓ సహా ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇటీవల కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశాం.

– మధుసూదన్, ఆరోగ్య తెలంగాణ కో ఆర్డినేటర్



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజల్లో నమ్మకం పెంచండి

- అభివృద్ధి పనులను పెండింగ్ పెట్టొద్దు
- ఉద్యోగులందరూ యాప్‌లోనే అటెండెన్స్ వేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఇతర ప్రాధాన్యత పనులు పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో నిత్యం చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. ధరణి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. గుంట భూమి కూడా తారుమారు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి ద్వారా సమస్యలు తీరుతాయనే నమ్మకం జనాల్లో రావాలన్నారు. మండలాల్లో క్లియర్ చేయలేని సమస్యలను మాత్రమే జిల్లా కేంద్రం వరకు వచ్చేలా చూడాలని సూచించారు. విద్యాశాఖ మినహా.. అన్ని శాఖల అధికారులు అటెండెన్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, హాజరు వేయాలన్నారు.

230 ఫిర్యాదులు

ప్రజల సమస్యలను ఓపికగా విని పరిష్కారం చూపాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌తో కలిసి ప్రజావాణిలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 230 వినతులు అందాయని, వీటిని వెంటనే పరిశీలించాలని సూచించారు.

ఈ– శ్రామ్‌లో నమోదు చేసుకోండి

అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈశ్రామ్ గుర్తింపు కార్డులు అందజేస్తున్నారని, అర్హులైన వారందరూ కార్డులు పొందాలని కలెక్టర్ సూచించారు. వీరు ప్రమాదవశాత్తు మృతిచెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఉచిత బీమా వర్తిస్తుందని తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం అందించే సామాజిక భద్రత, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 85వేల మంది కార్మికులు పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని వివరించారు. మిగిలిన వారు వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలోని సన్నకారు రైతులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, అంగన్‌వాడీ, బీడీ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9700112524 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం వెలకట్టలేనిది

- సిరిపురం యాదయ్య విగ్రహావిష్కరణలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సిరిపురం యాదయ్య ఆశయాలను సాధిస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ అమరుడు సిరిపురం యాదయ్య 13వ వర్ధంతి సందర్భంగా సోమవారం మహేశ్వరం గేటు కమాన్ వద్ద ఆయన విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరుల త్యాగం వెలకట్టలేనిదన్నారు. యాదయ్య 21 ఏళ్ల వయస్సులో తెలంగాణ సాకారం కోసం ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ప్రాణత్యాగం చేశాడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అమరుల త్యాగం వృథా కాకుడదని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఆర్థికసాయం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కేసీఆర్ ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలిచారన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు.

బాలికపై లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు



యాలాల: కారులో ఇంటికి తీసుకెళతానని నమ్మబలికిన ఓ యువకుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది ఈ నెల 13న విద్యార్థులను విహారయాత్ర కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పాఠశాలకు చేరుకున్నారు. తెల్లవారుజామున స్కూల్‌కు చెందిన బాలిక స్వగ్రామానికి వెళ్లేందుకు ఒంటరిగా రోడ్డు పక్కన నిలబడి ఉంది. ఈ సమయంలో కారులో వెళుతున్న రఘు అనే యువకుడు సదరు బాలికను వారి ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని నమ్మబలికాడు. పాఠశాల సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా బాలికను ఒంటరిగా అతడి కారులో పంపించారు. ఇదే అదనుగా భావించిన యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటి వద్ద వదిలేశాడు. నీరసంగా ఉండడంతో మరుసటి రోజు పాఠశాలకు వెళ్లేందుకు బాలిక నిరాకరించింది. అనుమానించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రశ్నించగా, జరిగిన విషయాన్ని వివరించింది. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు స్కూల్‌కు వెళ్లి ఉపాధ్యాయులను నిలదీశారు. అనంతరం యాలాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక నుంచి వివరాలు సేకరించారు. అనంతరం రఘుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా విద్యార్థులను విహార యాత్ర తీసుకెళ్లిన ఉపాధ్యాయులు వారిని జాగ్రత్తగా ఇంటికి చేర్చాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.

చైర్‌పర్సన్, కౌన్సిలర్‌పై కేసు

- పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని అభియోగం
- వివరాలు వెల్లడించిన తాండూరు టౌన్ సీఐ రాజేందర్‌రెడ్డి
- రాజకీయ కుట్రలో భాగమేనని బాధితుల మండిపాటు

తాండూరు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కౌన్సిలర్ మనప్పురం రామకృష్ణపై కేసు నమోదు చేశామని తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన శివాజీ జయంతి ఉత్సవాల్లో తమ విధులకు అడ్డుపడటంతో పాటు డీఎస్పీ డౌన్‌డౌన్ అంటూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారని తెలిపారు. పోలీసు వ్యవస్థపై దుష్ప్రభావం చూపేలా వ్యవహరించిన ఇరువురిపైనా కేసు నమోదు చేశామని స్పష్టంచేశారు.



చైర్‌పర్సన్ స్వప్న చేతిలోనుంచి మైక్ లాగేసుకుంటున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

అసలేం జరిగిందంటే..

హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంతి సంబరాల్లో.. బజరంగ్‌దళ్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక పైనుంచి పలువురు నేతలు ప్రసంగించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషితో తాండూరులో రోడ్లు మెరుగుపడ్డాయని తెలిపారు. అయితే ఇది రాజకీయ ప్రకటన అంటూ హిందు ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ నాయకులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. అనంతరం హిందూ ఉత్సవ సమితి అధ్యక్షురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న వేదికపై మాట్లాడుతుండగా.. డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆమె చేతిలోంచి మైక్ లాక్కున్నారు. ప్రశాంతంగా సాగుతున్న ఉత్సవ వేదికపైకి వచ్చి వేడుకలను అర్ధంతరంగా ఆపేసిన పోలీసుల తీరును బీజేపీ, బీఆర్‌ఎస్, హిందు ఉత్సవ సమితి నాయకులు తప్పుపట్టారు. అనంతరం డీఎస్పీ డౌన్‌డౌన్ అంటూ చైర్‌పర్సన్ నినాదాలు చేశారు. హిందువుల ఉత్సవాలను అడ్డం పెట్టుకుని పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తమపై కేసులు నమోదు చేయడం, హిందువుల వేడుకలను అడ్డుకోవడం రాజకీయ కుట్ర అని మండిపడ్డారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులే గొడవలకు కారణమవడంతో పాటు తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలతో ప్రజల్లో పలచన కావద్దన్నారు.

క్లుప్తంగా

గంజాయి, గుడుంబాను నివారిద్దాం: ఎస్పీ కోటిరెడ్డి


ఎక్సైజ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: కలసికట్టుగా పని చేసి గంజాయి, గుడుంబాను నివారిద్దామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, గుడుంబా నిర్మూలనే కోఆర్డినేషన్ మీటింగ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులు కలిసి కట్టుగా పనిచేసి గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నారు. గుడుంబా, కల్తీ మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, ఎక్సైజ్ శాఖ డీపీఈఓ నవీన్‌చంద్ర, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ధన్వత్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ తిరుపతిరాజు, ఎక్సైజ్ సీఐలు జిలానీ బేగ్, సైదులు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పరిగి: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సయ్యాద్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి(51) కొంత కాలంగా కడుపునొప్పిలో బాధపడుతున్నాడు. సోమవారం కడుపునొప్పి తీవ్రం కావడం భరించలేక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: ఈఎంఆర్ఐ 108 సంస్థలో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం మేనేజర్ సీహెచ్ నరేందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పైలెట్ (డ్రైవర్), ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కోసం ఈ నెల 23న తాండూరు జిల్లా ఆస్పత్రిలో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. పైలెట్ ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వయస్సు 23 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఎల్ఎంవీ బ్యాడ్జ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈఎంటీ ఉద్యోగాల కోసం బీఎస్సీ – (బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ విద్యార్హతలతో పాటు, 30 సంవత్సరాలలోపు వయస్సు ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ 9703958721, 7337324331 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

వ్యాన్, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

కొత్తూరు: డీసీఎం వ్యాన్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన కొత్తూరు పరిధిలోని తిమ్మాపూర్ – చేగూరు ప్రధాన రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన మల్లయ్య(62) నందిగామ మండలం ఈదులపల్లి గ్రామంలో నిర్వహించిన బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. ఈ నేపథ్యంలో కుమ్మరిగూడ వద్దకు రాగానే తిమ్మాపూర్ నుంచి ఫాతిమాపూర్ వైపునకు వెళ్తున్న డీసీఎం, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగు భారం..!

- పెరిగిన ఎరువుల ధరలు
- సాగు చేయలేమని ఆవేదన
- రైతన్నలపై తీవ్ర ప్రభావం


దౌల్తాబాద్‌లో సాగులో ఉన్న వరి పంట

దౌల్తాబాద్: అన్నదాతలకు పంటల సాగు భారమవుతోంది. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఎరువుల ధరలు చుక్కలనంటుతుండడంతో రైతులు సతమతమవుతున్నారు. ధరల పెరుగుదలతో పంటల సాగు ఖర్చులు అధికమవుతున్నాయి. దీంతో గిట్టుబాటు కావాడం లేదని వాపోతున్నారు. మండలంలో 4,689 ఎకరాల్లో వరి, 1,558 ఎకరాల్లో వేరుశనగ, 99 ఎకరాల్లో కుసుమ, 800 ఎకరాల్లో కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వీటికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో సాగు పెట్టుబడి మరింత భారమైంది.

డీజిల్ ధరల ప్రభావం..

పెట్రోలు, డీజిల్ ధరల పెంపు ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటల సాగుపై ప్రభావం చూపుతోంది. దుక్కులు దున్నడం, పురుగు మందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తి స్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపుతో ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. దీంతో రైతులపై పెట్టుబడి భారం పెరిగింది. మరోవైపు ఎరువు ల తయారీకి వినియోగించే ముడిసరుకు ధరలు పెరిగాయి. ఒక బస్తా ఎరువుల ధరను రూ. 250నుంచి రూ.500 వరకు పెంచారు. కాంప్లెక్స్ ఎరువులపై రాయితీలను తగ్గింపుతో ధరలు పెంచుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల ధరలు ఇలా..

ప్రస్తుతం 50కిలోల డీఏపీ ధర రూ. 1350 ఉండగా 20–20–13 ఎరువు ధర రూ.1400 చేరగా 14–35–14 రూ. 1500, 28–28–0 రూ. 1500కు ఎంటీపీ రూ.1700లకు చేరింది. పంటల సాగులో ఎరువుల కంటే పురుగు మందులకే ఎక్కువ పెట్టుబడి పెడుతున్నామని సన్న, చిన్నకారు రైతులు పేర్కొంటున్నారు.

“ఎరువులు కొనలేకపోతున్నాం



ఎరువుల ఖర్చు ఎక్కువ అవుతోంది. 50కిలోల బస్తా రూ. 1400నుంచి రూ.1500 వరకు ఉంది. ఎకరా పంట సాగుకు ఎరువుల కోసం రూ.10వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పురుగు మందు ధరలు కూడా రెట్టింపయ్యాయి. ధరల పెరుగుదల కారణంగా పంట గిట్టుబాటు కావడం కష్టంగా మారింది.

– నర్సింలు, రైతు, దౌల్తాబాద్

ప్రతి ఒక్కరిలో భక్తిభావం ఉండాలి

మహారాష్ట్ర పౌరదేవి పీఠాధిపతి బాబుజింగ్ మహరాజ్


హోమం చేస్తున్న పీఠాధిపతి బాబుజింగ్ మహరాజ్, పాల్గొన్న భక్తులు

పెద్దేముల్: గోర్ బంజార బిడ్డలు భక్తి భావాన్ని కలిగి ఉండాలని బంజార సమాజ్ ధర్మ గురు మహారాష్ట్ర పౌరదేవి పీఠాధిపతి బాబుజింగ్ మహరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని కందనెల్లి తండా సమీపంలో జోగో బంజార సమాజ్ వ్యవస్థాపకుడు సురేందర్ నాయక్, ఆయన సతీమణి రమావత్ శాంతిదేవి యాడీబాపుగడ్ ఆధ్యాత్మిక కేంద్రానికి రూపకల్పన చేశారు. సేవాలాల్ మహరాజ్, మార్యమ్మ ఆలయాలను నిర్మించారు. వీటిని సందర్శించడానికి వచ్చిన బాబుసింగ్ మహరాజ్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ మాట్లాడారు. గోర్ బంజార బిడ్డలు గోమాతను ప్రేమించడం తోపాటు పూజించాలని సూచించారు. సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో నీ ఆలయాలు గొప్పగా విరాజిల్లుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మ రక్షణకు పాటుపడాలని సూచించారు. తాండూరు ఎమ్మెల్యే సహకారంతో బోరుమోటార్, విద్యుత్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అనంతరం శివాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో యాడీబాపుగట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్ మహరాజ్, శాంతిదేవి, వైస్ ఎంపీపీ మధులత, నాయకులు రాజు, కాశీనాథ్, భన్యా మహరాజు, శేఖర్‌రెడ్డి, తారాబాయి, సుజాత, ప్రవీణ్, రుసాబాయి, ధర్మాబాయి, శోభ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం మల్కాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బిజాన్‌బీ ఇల్లు ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు బూడిదయ్యాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి తహసీల్దార్‌ను కోరారు.

నోటిఫికేషన్ల పేరిట చెలగాటం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సదానందరెడ్డి

ధారూరు: ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ చేస్తామని వరుస నోటిఫికేషన్ల ఇస్తూ నిరుద్యోగులతో కేసీఆర్ సర్కారు చెలగాటమాడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ ఆరోపించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నిరుద్యోగులను మభ్యపెట్టి మళ్లీ ఓట్లు దండుకోవాలని బీఆర్ఎస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం ధారూరు మండలం నాగ్‌సాన్‌పల్లి, తరిగోపుల, మైలారం గ్రామాల్లో శక్తి కేంద్ర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చింతకుంట – మైలారం గ్రామాల మధ్య రైల్వే వంతెన కింది నుంచి రోడ్డు వేసినా ఇంతవరకు బీటీ చేయలేదన్నారు. దీంతో ఈ మార్గం గుంతలమయంగా మారిందన్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా రుణమాఫీకి అతీగతీ లేదన్నారు. సబ్సిడీలు ఎత్తివేసి ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల రేట్లను పెంచి రైతులను సీఎం కేసీఆర్ ప్రభుత్వం దోచుకుంటోందని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం హామీ ఏమయ్యిందని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్‌రావు, శంకర్, శ్రీధర్, శ్రీకాంత్, రవీందర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న జీపు

వ్యక్తి మృతి, మరో ఇద్దరికి గాయాలు

పెద్దేముల్: బైక్‌ను జీపు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్ కథనం మేరకు.. నాగులపల్లికి చెందిన ఈడ్గి మహేష్, బోయిని అజయ్, బుద్దారం గ్రామానికి చెందిన శ్రీను తాండూరు నుంచి పెద్దేముల్‌కు బైక్‌పై బయలు దేరారు. పెద్దేముల్ నుంచి తాండూరు వైపు వస్తున్న జీపు బుద్దారం వాగు వద్ద బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రయాణిస్తున్న శ్రీను(18) మృతి చెందాడు. మహేష్, అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. జీపు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- జోరుగా కలప అక్రమ వ్యాపారం
- నిత్యం ఐదు నుంచి ఆరు లారీల్లో తరలిపోతున్న కలప
- రాత్రి వేళ గుట్టుగా రవాణా
- వాల్టా చట్టానికి తూట్లు
- కన్నెత్తి చూడని అధికారులు


నారెగూడ గ్రామంలో నరికిన చెట్లు

నవాబుపేట: కలప అక్రమ వ్యాపారం జోరందుకుంది. అక్రమార్కులు అటవీ సంపదను యథేచ్ఛగా దోచేస్తున్నారు. కాపాడాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నవాబుపేట మండలంలో వారం 10 రోజుల నుంచి కలప అక్రమ రవాణా జోరందుకుంది. ప్రభుత్వం హరితహారంలో భాగంగా వేల సంఖ్యలో మొక్కలు నటుతోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ కార్యక్రమానికి తూట్లు పడుతోంది. మండలంలోని నారెగూడ, లింగంపల్లి, గంగ్యాడ, పులుమామిడి, ఎల్లకొండ, దాతాపూర్, నవాబుపేట, అక్నాపూర్ తదితర గ్రామాల్లో కొందరు కలప వ్యాపారులు చెట్లను కొనుగోలు చేసి విచ్చలవిడిగా నరికేస్తున్నారు. రాత్రి వేళ గుట్టుగా రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్క నవాబుపేట మండలం నుంచే నిత్యం ఐదు నుంచి ఆరు లారీల్లో కలప తరలిపోతోందని మండల వాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకుంటూ వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేణి, తుమ్మ, వేప, చింత తదితర చెట్లను రైతుల వద్ద తక్కువ ధరకు కొని, వ్యాపారులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను నాశనం చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

జూన్ వరకు అంతే..

ప్రతి సంవత్సరం ఈ సీజన్ వచ్చిందంటే చాలు వికారాబాద్, శంకర్‌పల్లి, సంగారెడ్డి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుంచి కలప వ్యాపారులు ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి మొదలు కొని జూన్ వరకు పంటలు అయిపోవడాన్ని అనుకూలంగా భావించి వ్యాపారులు చెట్లను నరికి జేబులు నింపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వేల సంఖ్యలో చెట్లను నరికి పర్యావరణానికి చేటు చేస్తున్నారు.

నాటడం మీద ఉన్న శ్రద్ధ చెట్ల రక్షణపై లేదు

ప్రభుత్వం హరితహారంలో భాగంగా ప్రతి ఏటా గ్రామాల్లో వేల మొక్కలు నాటుతోంది. అయితే పెద్ద పెద్ద చెట్లను రక్షించడంలో శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కలప అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులకు కనిపించడం లేదని పలువురు మండిపడుతున్నారు.

“చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా చెట్లను నరికితే చర్యలు తీసుకుంటాం. చెట్లను నరుకుతున్నట్లు గుర్తిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి. తక్షణం ఘటనా స్థలానికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేస్తాం. వాల్టా చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్న చర్యలు తప్పవు.

– రవీందర్, తహసీల్దార్, నవాబుపేట

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

ఎంపీ రంజిత్‌రెడ్డి



యాదయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించిన సిరిపురం యాదయ్య త్యాగం వెలకట్టలేనిదని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డా. గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదయ్య 13వ వర్ధంతిని పురస్కరించుకుని తరంగ ఫౌండేషన్ చైర్మన్ సిలివేరు వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సుదీర్ఘంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో సిరిపురం యాదయ్య లాంటి యువకులు అనేక మంది ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలను తెలంగాణ ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఫలాలను ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ యువజన నాయకులు కార్తీక్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, వీరమల్ల రాంనర్సింహాగౌడ్, పురుషోత్తంరావు, మహేందర్ యాదవ్, లోకసాని కొండల్‌రెడ్డి, అంకిరెడ్డి, మహ్మద్ సలీం, ఋషి పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన బీజేపీతోనే సాధ్యం

కందుకూరు: ప్రజారంజక పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దెబ్బడగూడలో ఆదివారం రాత్రి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తూ తెలంగాణను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను దారి మళ్లిస్తున్నారే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ మండల అధ్యక్షుడు అనేగొని అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మీదేవేందర్‌రెడి పాల్గొన్నారు.

పాటల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం



మణికొండ: పాటల పోటీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీహర్షిత, కృష్ణ ప్రసన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిస్ ఆఫ్ హైదరాబాద్ 23 బ్యానర్‌పై చైతన్య స్పందన, చైతన్యగీతి వారు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. మార్చి 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలో పాల్గొనే అభ్యర్థులకు మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో, రెండు, మూడో రౌండ్లు ఆఫ్ లైన్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మూడో రౌండ్ సీబీఐటీ కళాశాలలో ఉంటుందన్నారు. విజేతలకు రూ.30 వేల ప్రైజ్‌మనీ అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ప్రతిభను ఈ వేదిక ద్వారా నిరూపించుకోవడానికి సదావకాశమని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ల 8688286682, 9392 846264లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే అనుచరుల వీరంగం

- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ ఇంటిపై దాడి
- కుటుంబ సభ్యులకు గాయాలు
- ఫర్నిచర్ ధ్వంసం.. తాండూరులో ఉద్రిక్తత


మురళీకృష్ణ ఇంట్లోకి చొరబడి దాడి చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మద్దతుదారులు

తాండూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, యంగ్ లీడర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణ ఇంటిపై సోమవారం రాత్రి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. టీఆర్ఎస్ యువజన విభాగం తాండూరు పట్టణ అధ్యక్షుడితో పాటు 70 మంది యువకులు ఒకేసారి ఇంట్లోకి చొరబడి బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఉన్న వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. పక్షం రోజుల పాటు పరిగి జైలులో ఉన్న మురళీకృష్ణ.. సోమవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం పరిగిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే మద్దతుదారులు ఏకమై అర్ధరాత్రి 10 గంటలకు మురళీకృష్ణ ఇంటిని ముట్టడించారు. వృద్ధులైన మురళీకృష్ణ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి మురళీకృష్ణ ఇంటికి చేరుకొని ఆందోళనకారులను బయటకు పంపించేందుకు యత్నించగా.. పోలీసులపైనా దాడి చేశారు. చివరకు పోలీసులు లాఠీలు ఝుళిపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన మురళీకృష్ణ క్షమాపణ చెప్పాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు.

భగవంతుడి శిక్షగా భావిస్తున్నా..

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్


జైలు నుంచి వస్తున్న మురళీకృష్ణగౌడ్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

పరిగి: డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఉన్నాయన్న విషయం తెలియక ఎంతో కష్టపడి పైలెట్ రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చేశానని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీజేపీ నేత మురళీకృష్ణగౌడ్ అన్నారు. పరిగి సబ్ జైలు నుంచి విడుదల అయిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నేను జైలుకెళ్లడం భగవంతుడు వేసిన శిక్షలా భావిస్తున్నా అని అన్నారు. ఎందుకంటే వ్యసనాలకు బానిసైన వ్యక్తిని కష్టపడి ఎమ్మెల్యేగా చేయడం తన తప్పని, అందుకే శిక్ష అనుభవించానని పేర్కొన్నారు. రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యే అయితే ప్రజలకు మేలు చేస్తాడని భావించానని, కానీ అక్రమ దందాలతో రాష్ట్రంలోనే పేరు గాంచుతాడని అనుకోలేదన్నారు. వన్‌టైం ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి తాండూర్‌లో మిగిలిపోతారన్నారు. త్వరలోనే రోహిత్‌రెడ్డిని తాండూర్‌ను ప్రజలు వెలగొట్టడం ఖాయమన్నారు. అక్రమ కేసులతో 14 మందిని జైలుకు పంపినంత మాత్రాన గొప్పవారు కాలేరన్నారు. త్వరలో మీ రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం వస్తుందన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. జైల్లో ఉన్నప్పుడు తన యోగక్షేమాలు తెలుసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

బడంగ్‌పేట్: ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బడంగ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సీబీఎం కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అండర్ –18 లాంగ్ జంప్ బాలుర విభాగంలో లస్కర్ నవీన్ (9వ తరగతి) ప్రథమ బహుమతి సాధించాడు. 100 మీటర్ల పరుగు పందెంలో బీ సురేష్(9వ తరగతి) మొదటి స్థానంలో నిలిచాడు. లాంగ్ జంప్‌లో సిద్ధార్థ(9వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో నరేష్ మొదటి స్థానంలో, 200 మీటర్ల రన్నింగ్‌లో సాయి యశ్వంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలాగే 400 మీటర్ల పరుగు పందెంలో అరుణ్ ద్వితీయ స్థానం పొందగా, సాయిజగన్ తృతీయ స్థానంలో నిలిచాడు. ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం పాఠశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే అర్జున్, ఉపాధ్యాయులు జ్యోతి, రాజశేఖర్, వెంకటరమణారెడ్డి, వెంకట్‌నారాయణరెడ్డి, సంగీత, వనజ, ప్రతాపరెడ్డి, హరికృష్ణ, శోభారాణి, సంతోష, సూర్యప్రభ, సత్యనారాయణగౌడ్, జానకిరాం, సులోచన, మురళీకృష్ణ, భీమాగౌడ్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు